ప్రజాశక్తి



శనివారం 20 సెప్టెంబర్ 2025 5 కర్నూలు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పాఠశాలల భవనాలను పరిశీలించాలి

- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఏవైనా పాఠశాల భవనాలు, అంగన్వాడీ కేంద్రాల భవనాలు ఏ స్థితిలో ఉన్నాయో సంబంధిత శాఖల ఇంజనీర్లతో వెరిఫై చేయించాలని, ఒకవేళ భవనం శిథిలమైన స్థితిలో ఉంటే వెంటనే మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఇఒ, ఐసిడిఎస్ పిడిలను ఆదేశించారు. పిల్లల రక్షణ ముఖ్యమని, ఇటీవల గోడ కూలి మృతిచెందిన విద్యార్థి అంశాన్ని ప్రస్తావించారు. ముందుగానే జాగ్రత్త పడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి పిజిఆర్ఎస్, పారిశుధ్య నిర్వహణ, ఉల్లి ఎన్యూమరేషన్, యూరియా సరఫరా, హౌసింగ్, ఎంఎస్ఎంఇ ఈ పార్కుల ఏర్పాటు కొరకు భూమి గుర్తింపు తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ సీరియస్‌గా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉన్నత స్థాయిలో ఈ అంశంపై సమీక్ష జరుగుతోందన్న విషయం గుర్తించి కోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేయాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో టాయిలెట్లను వాడేలా సచివాలయ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్లాప్ మిత్రలకు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిపిఒను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి రూఫ్ లెవెల్ లో ఉన్న 1565 ఇళ్లను వారం లోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సుమోటో కాస్ట్ వెరిఫికేషన్‌కు సంబంధించి కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆదోని అర్బన్‌లో ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైతులు ఉల్లి పంట విక్రయానికి వచ్చిన తర్వాత కోసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. యూరియా పంపిణీకి సంబంధించి సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్లాంటేషన్ కవరేజ్‌లో జిల్లా చాలా వెనకబడి ఉందని, మరింత లక్ష్యాన్ని పెంచి ప్లాంటేషన్ కార్యక్రమాల ను ముమ్మరంగా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు.. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

నేడు ఉచితంగా 6 వేల మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో కీలక ఘట్టానికి సర్వం సిద్ధం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి ప్రేమికులకు ఉచితంగా 6 వేల మొక్కలు అందిస్తున్నామని, పచ్చ సుంకేసుల, పెల్టోఫోరమ్, గుల్మోహర్, ఎర్ర సుంకేసుల, కొండ తంగేడు, గంగరావి, సీతాఫలం, తపస్సి, కానుగ, జామ, వేప వంటి తొమ్మిది రకాల మొక్కలను అన్ని సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర'కార్యక్రమం లో భాగంగా, "హరిత ఆంధ్ర" పేరుతో శనివారం కర్నూలులోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక సచివాలయంలో మొక్కలు పొందవచ్చని, ఒకవేళ అక్కడ మొక్కలు అయిపోతే అశోక్ నగర్ పంప్ హౌస్ లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని కమిషనర్ సూచించారు. ప్రజలు తమ ఇళ్ళు, బాల్కనీలు, హాస్టళ్ల వంటి భవనాలపై మిద్దె తోటలు పెంచితే నగరపాలక సంస్థ తరఫున బహుమతులు అందజేస్తామని, ఆసక్తి కలిగిన వారు స్థానిక సచివాలయంలో శానిటేషన్ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్ నివారణ కోసం ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శ్రీరాంనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుచున్న స్వస్థ నారి-స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్. మహేశ్వార ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం మహిళలతో క్యాన్సర్ నివారణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలోని క్యాన్సర్‌ను నివారించడానికి, మహిళల ఆరోగ్యం, పోషణ, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలులను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం అందరికీ 'క్యాన్సర్ పరీక్షలు' అనే నినాదంతో మన రాష్ట్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులలో నిర్వహిస్తున్న ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాలకు 18 సంవత్సరాలు పైబడిన మహిళలందరూ ఎటువంటి సందేహం లేకుండా స్వచ్ఛందంగా వచ్చి కేన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకుంటామని, నాతోటి మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించి వారిని కూడా స్క్రీనింగ్ చేయించుకోవలసిందిగా ప్రోత్సహిస్తామని, బలమైన కుటుంబం, ఆరోగ్యకరమైన భారతదేశం కోసం మా వంతు సహకారం అందిస్తానని ప్రతిజ్ఞ చేయుచున్నాను.' అని కేన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యమని ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుండి రక్ష అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నందిని, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆశా కార్యకర్తలు , ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ మహేశ్వర ప్రసాద్

విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల ఆందోళన ఉధృతం

- విద్యుత్ సౌధ వద్ద జెఏసి ఆధ్వర్యంలో నిరసన దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారాలు చేయనందునే జెఏసి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. శుక్రవారం విద్యుత్ భవన్ వద్ద ఉద్యోగులు, కార్మికులు నిరసన దీక్షలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలలో సుమారు 52 వేల మంది శాశ్వత ఉద్యోగులు, కార్మికులు, ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నా రన్నారు. గత ప్రభుత్వంలో మా సమస్యను పరిష్కరించనందున ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించడంలో ఉద్యోగుల పాత్ర మరువలేని దన్నారు. మన మంచి ప్రభుత్వం వచ్చింది, మా సమస్యలను పరిష్కంచడంలో ముందుంటుందని భావించిన మాకు నిరాశే నిరాశే ఎదురైందన్నారు. అనేక సమస్యలు సమస్యలుగానే ఉన్నాయని, పరిష్కంచండి అని విద్యుత్ యాజమాన్యాలను ఎపి పవర్ జెఏసి తరపున అనేకసార్లు కలసి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఆగస్టు 25 నుంచి దశల వారి ఆందోళన కార్యక్రమాల సమ్మె నోటీసును ఇచ్చామన్నారు. అందులో భాగంగా నిరసన కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. శుక్రవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కార్మికులు, ఒప్పంద కార్మికులు 'దీక్ష'ను దిగ్విజయం చేసినందుకు వారికి కర్నూలు జిల్లా విద్యుత్ జెఏసి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 20నాటి దీక్షలో ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ డివిజన్ లలో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. భగస్వామ్య సంస్థలు అన్నిముందుండి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.

మద్దతు తెలిపిన ముఖ్యులు : సి బెళగల్ ఉసేని, ఎస్సీ, ఎస్టి అసోషియేషన్ అధ్యక్షులు శివకుమార్ పెద్దయ్య, ఎం. నాగశేషులు, భాస్కర్, సురేష్1104 వై. భాస్కరరావు, నాగమల్లేశ్వరరావు, కృష్ణయ్య, పివి. రామరాజు, కె.వెంకటేశ్వరు , ఆనంద్, దేవపాల్ , పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల జెఏసి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

బలవంతపు భూసేకరణ ఆపాలి

-మోసపూరిత మాటలు చెబుతున్న కంపెనీలు

-న్యాయమైన నష్టపరిహారం పునరావాసం కోసం 24 చలో విజయవాడ

ప్రజాశక్తి-పత్తికొండ

సోలార్ విద్యుత్తు కొరకు భూ సేకరణలో భాగంగా ఆయా కంపెనీలు రైతులున్నట్టేట ముంచే మాటలతో 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని రైతులు జాగ్రత్తతో ఉండాలని, రైతులకు ఎకరాకు రూ.50వేల లీజు ఇవ్వాలని, అగ్రిమెంటు 10 సంవత్సరాలకు కుదుర్చుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ లు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ ఈశ్వర్ రెడ్డి భవన్లో వారు విలేకరులతో మాట్లాడుతూ సంవత్సరానికి ఎకరాకు రూ.30,000 లీజుకు తీసుకుంటామని లేదా ఎకరాకు రూ.5.25 లక్షలకొనుగోలు చేస్తామని మన గ్రామాలలో సోలార్ కంపెనీలు తమ ఏజెంట్ల ద్వారా రైతులను ప్రలోభపెట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. తమ కమిషన్లకు కక్కుర్తిపడి మధ్యదళారులు చెప్పే మాటలకు రైతులు మోసపోవద్దని, పంటలు పండటం లేదని, చౌడు భూములు అని, విత్తనాలకు కూడా గిట్టుబాటు కావటం లేదని వివిధ కారణాలతో కొందరు రైతులు భూములు అమ్మేందుకు, లీజుకు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారన్నారు. రైతులు తొందరపడి సోలార్ కంపెనీలకు మీ భూములు లీజుకు గాని, అమ్మకానికి కానీ ఇవ్వవద్దని లీజు అనంతరం రైతాంగానికి తీవ్ర నష్టం వస్తుందన్నారు. 30 సంవత్సరాలలో భూమి మీద హక్కు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని వారు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా సోలార్ కంపెనీ సంవత్సరానికి సుమారుగా రూ.75 లక్షల నుండి రూ.80 లక్షల విలువైన విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఎకరాకు రూ.30,000 చొప్పున 5 ఎకరాలకు లీజు కింద రైతులకు సోలార్ కంపెనీ రూ 1.50 లక్షలు మాత్రమే ఇస్తుందన్నారు. సోలార్ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే మన భూమినే వారికి ప్రధానమైన వనరని, మన భూమి లేకుంటే సోలార్ కంపెనీ పెట్టలేరన్నారు. విద్యుత్ ఉత్పత్తి చేయలేరన్నారు. రైతుకు ఒకసారి ఎకరాకు రూ.5 లక్షలు ఇచ్చి సోలార్ పెట్టుబడి ఖర్చులు పోను జీవిత కాలం వారు సంవత్సరానికి రూ.16 లక్షల లాభం పొందే ఆలోచన చేస్తున్నారన్నారు. రైతులు మీ భవిష్యత్తును, మీ పిల్లల భవిష్యత్తును ఫణంగా పెట్టి మీ భూములను సోలార్ కంపెనీలకు ఇవ్వాలనే ఆలోచన పై నిశితంగా గమనించి రైతులు ముందడుగు వేయాలని కోరారు. రైతుల బాగు కోసం నిలబడి పోరాడే రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు మీకు అండగా ఉంటాయనీ భూమిపై జీవిత కాలం హక్కు కోల్పో వద్దని కోరారు. సంవత్సరానికి ఎకరాకు కనీసం రూ. 50,000లు కౌలు ఇవ్వాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20శాతం కౌలు పెంచి అగ్రిమెంట్ కాల పరిమితి గరిష్టంగా 10 సంవత్సరాలకు మించకుండా ఉండాలన్నారు. భూమిపై సోలార్ కంపెనీల ఆధిపత్యం లేకుండా ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. భూమి మొత్తం కోల్పోయే రైతులకు, భూమిపై ఆధారపడి జీవించే భూమిలేని వ్యవసాయ కూలీలు, వృత్తిదారులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం అమలు చేయాలిని కోరారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగారెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ లో పాల్గొన్నారు.

24న చలో విజయవాడ : రైతుసంఘం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఈనెల 24న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా చలో విజయవాడ కార్యక్రమాన్ని రైతులు వ్యవసాయ కార్మికులు జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. శుక్రవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఓర్వకల్లు మండలంలో ఉయ్యాలవాడ ఇతర గ్రామాలలో సమావేశం నిర్వహించారు. జి.రామకృష్ణ, వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో బలవంతంగా రైతుల ఆమోదం లేకుండా గ్రామసభలు నిర్వహించకుండా విచ్చలవిడిగా రైతుల భూములను సేకరిస్తున్నారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లేని సోలార్ ప్రాజెక్టుల కోసం రైతుల ఆమోదం లేకుండా రైతులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా భూములను లాక్కుంటే సహించబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతుల భూములకు నష్టపరిహారం, వ్యవసాయ కార్మికులకు పునరావాసం కల్పించి భూసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం చలో విజయవాడకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు



అందాల రాజ్యానికి మీకిదే మా ఆహ్వానం

24న వస్త్రాలయ షాపింగ్ మాల్ ప్రారంభం

ప్రముఖ సినీతార నిధి అగర్వాల్ రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 24న కర్నూలు నగరంలోని అమ్మహాస్పిటల్ దగ్గర, నంద్యాల చెక్‌పోస్టు రోడ్డులో వస్త్రాలయ షాపింగ్ మాల్ ప్రారంభం కానుందని మార్కెటింగ్ మేనేజర్ రవి తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి ప్రముఖ సినీతార నిధి అగర్వాల్ రానున్నారని పేర్కొన్నారు. ఈ గొప్ప ప్రారంభోత్సవం సందర్భంగా శారీస్ విభాగంలో ఓపెనింగ్ ఆఫర్స్ ఉన్నాయని తెలిపారు. వెడ్డింగ్ కలెక్షన్స్, పట్టుశారీస్, ఫాన్సీశారీస్, బ్రైడల్ గాగ్రాస్, చుడిదార్స్ , డ్రెస్ మెటీరియల్స్, లేడీస్ వెస్ట్రన్ వేర్ , కిడ్స్ వేర్, మెన్స్‌వేర్, మెన్స్ ఎథినిక్ వేర్, హోమ్ ఫర్నిసింగ్ తదితరాలుంటాయని తెలిపారు. డైలీడ్రాలో సర్‌ప్రైజ్ గిఫ్ట్, బంపర్ డ్రాలో కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఈ అదిరిపోయే ఓపెనింగ్ ఆఫర్స్ మిస్ కావద్దని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాస్

హిందీ భాష పై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు హిందీ భాష నేర్చుకుని, దానిపై పట్టు సాధిస్తే జాతీయ స్థాయిలో అవకాశాలు అధికంగా ఉంటాయని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ హిందీ విభాగం అధ్యాపకురాలు ఎం.పార్వతి ఆధ్వర్యంలో జాతీయ హిందీ దినోత్సవం వేడుకలను సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో రిజిస్ట్రార్ డాక్టర్ జి శ్రీనివాస్ మాట్లాడారు. భాషను ఆధారంగా చేసుకుని మనల్ని ప్రాంతాలుగా విభజించారని, ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నా మాతృభాష ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ కె. నాగరాజ్ శెట్టి, డాక్టర్ అక్తర్ భాను, డాక్టర్ షామీద, డాక్టర్ బి.అనూష, డాక్టర్ బి. వెంకన్న, సిల్వర్ జూబ్లీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై. పక్కిరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

22న జిల్లా వ్యాప్తంగా ధర్నాలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర కార్మిక సంఘాల జాతీయ సమితి పిలుపుమేరకు శుక్రవారం సాయంత్రం నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన కార్మిక సంఘాల సమావేశం ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించారు. ఈనెల 22న జిల్లా వ్యాప్తంగా ధర్నాలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయ్, న్యూ సిటీ కార్యదర్శి నర్సింహులు, ఎఐటియుసి నగర్ ఉపప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాల రాసేందుకు తెచ్చిన లేబర్ కోడ్లు, దేశంలో ఉన్న కార్మిక వర్గానికి గొడ్డలి పెట్టువంటిదన్నారు. కార్మికుల లేబర్ కోడ్లు రద్దయేంతవరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దొడ్డిదారిలో లేబర్ కోడ్లు అమలు చేస్తూ 8 గంటల పని విధానాన్ని 10 గంటలు మారుస్తూ, రాత్రి వేళల్లో మహిళలు పని చేయించాలని నిర్ణయం చేయడం, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులు అప్పజెప్పి దేశ సంపదన కొల్లగొడుతున్నారని తక్షణమే ప్రైవేటీకరణను ఆపాలని, అదేవిధంగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు ఎన్నికల సందర్భంగా గత ప్రభుత్వం రద్దు చేసిన భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తానని, పెండింగులో ఉన్నటువంటి లబ్ధిదారులకు డబ్బులు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తున్నా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఊసే ఎత్తడం లేదని చెప్పారు. ఆటోరంగంలో లక్షల కార్మికుల ఉపాధికి గండి పడే విధంగా స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సులు వచ్చాయన్నారు. ఆటో కార్మికుల కడుపు కొడుతున్నారని, ప్రత్యామ్నాయంగా ఆటో కార్మికులకు ఉపాధి చూపించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ఉన్నటువంటి అన్ని నియోజకవర్గ,మండల కేంద్రంలో విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఎఐటియుసి నాయకులు నల్లన్న , కృష్ణ , బాబూలాల్ ,పులగం మద్దిలేటి , పురుషోత్తం మాణిక్యం ,నాగేంద్ర తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్ రాధాకృష్ణ

జిజిహెచ్ విభాగాధిపతులతో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు వైద్య కళాశాల కాన్ఫరెన్స్ హాలులో ఆసుపత్రి అడిషనల్ డి ఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, కర్నూలు వైద్య కళాశాల అడిషనల్ డిఎంఇ ప్రిన్సిపల్, డాక్టర్ చిట్టి నరసమ్మతో కలిసి విభాగాధిపతుల సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పేషెంట్లకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, అత్యవసర విభాగం పనితీరు, సిబ్బంది హాజరు, ఆసుపత్రి పరిశుభ్రత, పరికరాల వినియోగం, సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి విభాగాధిపతి తమ విభాగంలోని పనితీరు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆసుపత్రులపై ప్రజలకు గల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మనందరి బాధ్యత రోగులకు సమయానికి మెరుగైన చికిత్స అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి సిబ్బంది పేషెంట్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలకు వెంటనే స్పందించాలి అని అన్నారు. వైద్యసేవలందించడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల హెచ్ఒడిలతో సమన్వయం బలోపేతం చేసి పేషెంట్లకు అత్యుత్తమ సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి ఇన్చార్జి సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ, డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, సర్జరీ, మెడిసిన్, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, అనస్థీషియా, రేడియాలజీ, తదితర అన్ని విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

విద్యార్థుల పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ఆదోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణ చేయరాదని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేసిన న్యాయమైన పోరాటాన్ని పోలీసులు కర్కషంగా లాఠీచార్జీ చేసి కేసు ఫైల్ చేయడం చాలాఅన్యాయని సిఐటియు నగర కార్యదర్శి వర్గం తీవ్రంగాఖండించింది. కర్నూలు నగర సిఐటియు న్యూ సిటీ నగర కార్యదర్శి వర్గ సమావేశం శుక్రవారం కార్మికకర్షక భవనంలో సిఐటియు నగర అధ్యక్షులు వై.నగేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శివర్గ సభ్యులు కె.సుధాకరప్ప ,టి.రాముడు, సిహెచ్.సాయిబాబా, బి.రాధాకృష్ణ, ఎస్ఎండి. మహమ్మద్ రఫీ, ఎం, వెంకటేశ్వర్లు, జి.ఏసు, ఆర్.ఓబులేసు, జె.లక్ష్మీబాయి పాల్గొన్నారు. సిఐటియు న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు ,నగర అధ్యక్షులు వై .నగేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేయరాదని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం చేసిన కార్యక్రమాన్ని సిఐటియు న్యూ సిటీ కమిటీ సంపూర్ణంగా బలపరుస్తున్నదని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగప్పను, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు సాయి తదితర విద్యార్థులపై పోలీసులు కర్కశంగా లాఠీ చార్జి చేసి, బూటు కాళ్లతో తన్నుతూ పిడిగుద్దులు గుద్దుతూ దేశద్రోహులు తీవ్రవాదులపై దాడి చేసిన విధంగావిద్యార్థులపై దాడి చేయడం పోలీసులది చాలా హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు భాగస్వామ్యంతో నడుపుతామనడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. దీనిని మేధావులు చైతన్యవంతులైన ప్రజలు, యువకులు ప్రైవేటీకరణను తీవ్రంగావ్యతిరేకించి అడ్డుకోవలసిన అవసర ముందన్నారు. విద్యార్థి సంఘాలకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు అధికారులు విద్యార్థులు చేస్తున్నపోరాటం న్యాయమైనదా కాదా అని ఆలోచించి. విద్యార్థులపై లాఠీచార్జి చేయాలన్నారు. ఆ విధంగా ఆలోచన చేయకపోతే రాబోయే రోజుల్లో పోలీస్ అధికారుల పిల్లలకు కూడా మెడికల్ సీట్లు రావాలంటే డబ్బులు పెట్టి కొనుక్కుంటే కానీ రాదు అనేది అర్థం చేసుకోవాలన్నారు.



శిక్ష పడిన ఐదుగురిని జైలుపు పంపుతున్నా పోలీసులు

ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులలో ఐదుగురికి శిక్ష

- 9 సంవత్సరాల 2 నెలల జైలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో ఐదుగురికి తొమ్మిదేళ్ల రెండు నెలలపాటు జైలు శిక్ష విధిస్తూ కర్నూలు ఎస్సీ ఎస్టీ విభాగం కోర్టు జడ్జి వాసు తీర్పు వెలువరించారు. కర్నూలు జిల్లా, కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ కి చెందిన నేసే శ్రీనివాసులు, నేసే రాజు , నేసే సరోజ, భర్త శ్రీనివాసులు, నాగజ్యోతి నేసే వెంకటేశు అలియాస్ వెంకటేష్ వీరందరూ ఒక కుటుంబం ఇంటి పక్కన గోవిందమ్మ కుటుంబం ఉంటుంది. గోవిందమ్మ ఇంటి నుండి వచ్చే మురుగు నీళ్ళు వీళ్ళ ఇంటి స్థలంలోకి వస్తున్నాయని 2018 మే 17 తేదిన నేసే శ్రీనివాసులు కుటుంబ సభ్యులు గోవిందమ్మతో గొడవలు పడి కులం పేరుతో దూషించారు. మరొకసారి 2018 జూన్ 3న గోవిందమ్మ ఇంటి నుండి నేసే శ్రీనివాసులు వారి ఇంటి స్థలంలోకి మరల మురుగు నీళ్ళు వస్తున్నాయని గోవిందమ్మపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయం పై కర్నూలు నాల్గవ పట్టణం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయింది. అప్పటి ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పిలు మురళీధర్ రెడ్డి, వినోద్ కుమార్ లు సమగ్రంగా దర్యాప్తు చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును విచారించిన పిదప నేరం రుజువు కావడం తో ఎస్సీ ఎస్టీ విభాగం కోర్టు జడ్జి వాసు ఐదుగురు నిందితులకు తొమ్మిదేళ్ల రెండు నెలల జైలు శిక్ష విధించారు. నేసే శ్రీనివాసులు కు రూ. 25 వేలు జరిమానా , మిగతా నలుగురికి నేసే రాజు, నేసే సరోజ, నాగజ్యోతి , నేసే వెంకటేశు లు ఒక్కొక్కరికి రూ. 20 వేల జరిమానా విధించారు. కేసు నమోదు చేసి, పక్కాగా దరాప్తు చేసిన డిఎస్పిలను పోలీసు అధికారులను, సాక్షులను కోర్టు ముందు హాజరు పరిచిన కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

నిరాశగా వెనుతిరిగిన అర్జిదారులు

-వెలవెల బోయిన స్పెషల్ గ్రీవెన్స్

-వేదికలో మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తిలో ప్రజా సమస్యల వేదిక వెలవెలబోయింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ప్రజా సమస్య వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారులు రాకపోవడంతో అర్జీదారులు నిరాశతో వెనుతిరిగారు. దీంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కాగా మండలంలో 99 అర్జీలు రాగా శాఖల వారిగా రెవెన్యూ 64, సర్వే 24, పంచాయతీరాజ్ 8, రవాణా శాఖ 1, పోలీస్ శాఖ 1, హౌసింగ్ దరఖాస్తు1, దరఖాస్తులు వచ్చినట్టు తహశీల్దార్ చంద్రశేఖర్ వర్మ తెలిపారు. అర్జీదారులకు మౌలిక వసతులు కల్పించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపిడిఒ సుహాసినమ్మ, డిప్యూటీ తహశీల్దార్ గురుస్వామిరెడ్డి, డిప్యూటీ ఎంపిడిఒ రవి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

బలవంతపు భూసేకరణను సహించేది లేదు

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆస్పరి

కూటమి ప్రభుత్వం రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కుంటే సహించేది లేదని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో రైతు, వ్యకాస ఆధ్వర్యంలో 'చలో విజయవాడ' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరుతో పోలీసుల సమక్షంలో ప్రభుత్వం రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కుంటుందని మండిపడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపి రైతు కూలీలను భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. మద్దతుగా వెళ్లిన నాయకులను సైతం ముందస్తు అరెస్టులు చేస్తూ రైతు కూలీల మనోధైర్యాన్ని దెబ్బతీస్తోందని తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 24న 'చలో విజయవాడ' రైతు కూలీల మహా ధర్నా చేపట్టేందుకు పూనుకున్నామని చెప్పారు. రాష్ట్ర నలమూలాల నుంచి రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం నాయకులు చిన్న మల్లేష్, వెంకటేశ్వర్లు, రైతు తిప్పన పాల్గొన్నారు.

మేలిగనూరులో సంగీత దర్శకులు కీరవాణి



గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న కీరవాణి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని మేలిగనూరు గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామిని సంగీత దర్శకులు ఎంఎం.కీరవాణి దర్శించుకున్నారు. శుక్రవారం కుంభాలనూర్ చేరుకొని బంధుమిత్రులను కలిశారు. అనంతరం మేలిగనూర్ గ్రామం వద్ద రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని, అక్కడే తన సొంత నిధులతో నిర్మించిన ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. గతంలో సంగీతం సాధన చేసిన స్థలం కావడంతో ప్రతి ఏడాది ఇక్కడికొచ్చి దర్శించుకుంటారు.

అభివృద్ధికి దూరంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్


ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విద్య, వైద్యం అందక అభివృద్ధికి దూరంగా ఉన్నారని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న మాదిగ విమర్శించారు. శుక్రవారం తహశీల్దార్ కె.రమాదేవికి, ఎంపిడిఒ నూర్జహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మంత్రాలయంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, బాలుర, బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయకులు అనిల్ కుమార్, మారెన్న, గోపాల్, సంగటి యోహాన్, మండల అధ్యక్షులు నరసింహులు, ప్రకాష్ పాల్గొన్నారు.

'జిప్లస్'లో మౌలిక వసతులు కల్పించాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'జి ప్లస్' గృహాలకు విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా డిమాండ్ చేశారు. శుక్రవారం 'జిప్లస్'లో తాగునీటి, విద్యుత్, ముళ్లకంప సమస్యను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో టిడిపి హయాంలో ఈ 'జిప్లస్ త్రీ' గృహాలు నిర్మించారని, ఇప్పటివరకు సమస్యలు పరిష్కరించలేదని తెలిపారు. ఉన్న కొంతమందికైనా ప్రభుత్వం స్పందించి ఎ-33, ఎ-34 బ్లాక్ గృహాల్లో విద్యుత్, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ముళ్లకంప తొలగించాలని డిమాండ్ చేశారు. కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. తిరపలమ్మ, ఈశ్వరి, విజయలక్ష్మి, విజయ్, రోజా, రాజశేఖర్, సోమన్న, చంద్ర, చిట్టెమ్మ, కుమార్ మాట్లాడుతూ... అధికారులు, నాయకులు వస్తున్నారని, చూసి మాట్లాడి పోతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించడం లేదని వాపోయారు. సిపిఎం పట్టణ నాయకులు రమేష్, రాజు, సురేష్, రవి, వీరేష్, రాజు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

నాయకులు, విద్యార్థులపై దాడులు అమానుషం

- డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - ఆదోని



సమావేశంలో మాట్లాడుతున్న రామన్న

వైద్య విద్యను దూరం చేయవద్దని, పేదలకు మెరుగైన వైద్యం కనుమరుగు చేయవద్దని అడిగిన ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు దాడులు చేయడం అమానుషమని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న విమర్శించారు. శుక్రవారం ఆదోనిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మెడికల్ కళాశాల ప్రయివేటీకరణను ఆపాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా చేపట్టారని, ఎస్ఎఫ్ఐ నాయకులపై తాలూకా ఎస్ఐ రామాంజనేయులు, ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్, పోలీసులు బూతులు తిడుతూ.. పిడిగుద్దులు గుద్ది లాఠీచార్జ్ చేశారని తెలిపారు. అడ్డుకోబోయిన విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించారని, ఫొటోలు తీసి తప్పుడు కేసులు పెడతామని బెదిరించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించాలని కోరారు. ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని తెలిపారు. ప్రజల హక్కులు, విద్యార్థుల భవిష్యత్తు కోసం, ప్రజారోగ్య పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఉమాకాంత్, చిరు, మహేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, నాగిరెడ్డి, రమేష్, పట్టణ అధ్యక్షులు మోహన్ పాల్గొన్నారు.

ఆలూరు : ఆదోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టగా.. నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు విమర్శించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. డివైఎఫ్ఐ ప్రాంతీయ అధ్యక్షులు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలను పిపిపి పేరుతో ప్రయివేట్‌కు అప్పజెప్పేందుకు కంకణం కట్టుకుందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గ విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. నాయకులపై లాఠీచార్జీ చేసి, పిడి గుద్దులు గుద్దిన ఎస్ఐలు డాక్టర్ నాయక్, రామాంజనేయులును సస్పెండ్ చేయాలని, విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు సుధాకర్, ఆఫ్టర్, రవి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బసవరాజు, ఉపాధ్యక్షులు సురేష్ వర్మ, శ్రీరామ్, సహాయ కార్యదర్శులు మణి, నాయకులు దాకే నాయక్, లోక్య నాయక్ పాల్గొన్నారు.



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న నాయకులు

పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

- వైసిపి ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కళాశాల'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తెచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 10 కళాశాలలను ప్రయివేట్‌పరం చేస్తూ తీసుకున్న పిపిపి విధానం నిర్ణయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేయాలని, మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే పూర్తి చేయాలని వైసిపి నాయకులు కోరారు. శుక్రవారం ఆదోని ఇన్‌ఛార్జీ వై.సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మిగనూరు ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, పత్తికొండ ఇన్‌ఛార్జీ కంగాటి శ్రీదేవి, వైసిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి, రాష్ట్ర యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ బుట్టా ప్రతుల్, కర్నూలు నగర అధ్యక్షులు అహ్మద్ అలీఖాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రశాంత్ ఆధ్వర్యంలో 'చలో మెడికల్ కళాశాల' చేపట్టారు. అనంతరం వారు ఆదోని మెడి కల్ కళాశాల పనులను పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరును మార్చు కోవాలని, లేకపోతే ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. వైసిపి నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ సుభాష్ చంద్రబోస్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

రజకులపై ప్రభుత్వాల చిన్నచూపు

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - నందవరం

రజకులపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ విమర్శించారు. శుక్రవారం గురుశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిపిఎం నాయకులు ఎల్లేష్‌లు గ్రామంలో పర్యటించారు. రజకుల వృత్తికి సంబంధించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గురుశేఖర్ మాట్లాడారు. రజకులను ప్రభుత్వాలు ఆదరించడం లేదని, గ్రామంలో రజకులను అభివృద్ధి పరచాలన్న సంకల్పంతో మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి నాలుగు ఎకరాల పొలాన్ని ఇచ్చారని తెలిపారు. వారి వృత్తికి ఉపయోగపడే విధంగా దోభీఘాట్లను నిర్మించి అక్కడున్న బావి ద్వారా నీటి సదుపాయం కల్పించారని చెప్పారు. ఆయన మరణించిన తర్వాత గ్రామంలో రజకులను పట్టించుకున్న నాయకులే లేరన్నారు. ప్రస్తుతం ఆ ప్రదేశం అడవిలా తయారయిందని, దోభీఘాట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. వృత్తి నిర్వహణకు రజకులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గతంలో వాగులు, వంకల్లో నీరు నిల్వ ఉండేదని, ప్రస్తుత వంకల్లో నీరు కనిపించడం లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆ ప్రదేశంలో మెలిచిన ముళ్ల చెట్లను తొలగించాలని, దోభీఘాట్లను నిర్మించాలని కోరారు.



దోభీఘాట్లను పరిశీలిస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

- **ఎంపిడిఒ అల్లా బకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి**
- **'తాగునీరు కూడా ఇవ్వలేరా' కథనానికి స్పందన**

ప్రజాశక్తి - చిప్పగిరి

తాగునీరు, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఎంపిడిఒ అల్లాబకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన 'తాగునీరు కూడా ఇవ్వలేరా' కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు తెలుసుకోవడానికి ఎంపిడిఒ అల్లాబకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మల్లికార్జున రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలలో రోజూ వచ్చే ఉప్పు నీటి సమస్య లేకుండా చూస్తామని, శుద్ధ జల కేంద్రం వాటర్ మిషన్ చెడిపోయినందున, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి మరమ్మతులు చేయించేలా కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల ప్రహరీకి నిధులు వచ్చిన వెంటనే నిర్మిస్తామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ప్రమీల పాల్గొన్నారు.

సమస్య పరిష్కారం

- 'ప్రజాశక్తి'కి కృతజ్ఞతలు : రైతు లక్ష్మన్న

ప్రజాశక్తి - నందవరం



సమస్య పరిష్కారం కావడంతో పెద్దకొత్తిలి గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం 'నాకు న్యాయం చేయండి' అనే శీర్షికన ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం రైతు సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడారు. గతంలో చిన్నకొత్తిలి గ్రామం నుంచి పూలచింత గ్రామానికి తాగునీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ వేశారని తెలిపారు. ఆ పైపులైన్ తమ పొలం గుండా వెళ్లిందని, రెండేళ్ల క్రితం తమ పొలం గుండా వెళ్లిన పైపు లీకయి నిరంతరం నీరు వస్తుండేదని చెప్పారు. తన పొలంలో సగం వరకు నీరు నిలిచి ఇబ్బందిగా ఉండేదని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని రెండేళ్లుగా ఇరువర్గాల నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. తన బాధను అర్థం చేసుకొని పత్రికలో ప్రచురించడం వల్ల సమస్య పరిష్కారమైందని తెలిపారు. అండగా నిలిచిన ప్రజాశక్తి విలేకరిని అభినందించారు.



మాట్లాడుతున్న రైతు

ఉల్లి ధరలపై ప్రభుత్వానికి స్పష్టత కరువు

- ఎమ్మిగనూరు మార్కెట్లో అయోమయ స్థితిలో ఉల్లి రైతు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఉల్లి ధరలపై ప్రభుత్వానికి స్పష్టత లేదని సిపిఎం మండల కార్యదర్శి పి.గోవిందు, రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, సిఐటియు నాయకులు నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం, రైతు సంఘం నాయకులు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలో రెండు రోజులుగా రైతుల నుంచి ఉల్లి కొనుగోలు నిలిపేశారని, ఉల్లిని అమ్ముకోవడానికి రైతులు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుకు వస్తున్నారని తెలిపారు. మార్కెట్ యార్డులో సరయిన సమాచారం లేక ఉల్లిని ఎవరు కొంటున్నారో.. ఎవరు కొనుక్కోవడం లేదో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారని చెప్పారు. మార్కెట్ యార్డు కార్యదర్శి, జిల్లా అధికారులు ఉల్లి రైతులకు సరయిన మార్గదర్శకాలు ఇవ్వకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని విమర్శించారు. మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలు చేస్తున్న కొనుగోలుదారులు, కమీషన్ ఏజెంట్లు టెండర్ల ద్వారా ధరను మార్కెట్ యార్డుకు తెలియజేస్తున్నారని, ఆ వివరాలు తెలియక రైతులు గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. ఉల్లికి సరైన ధర లేకపోవడంతో మార్కెట్‌కు తరలించడానికి రవాణా ఖర్చులకు కూడా సరిపోవని ఉల్లిని మార్కెట్లోనే వదిలేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఉల్లి కొనుగోలును పూర్తిస్థాయిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతుకు కొనుగోలుదారు ధరతో పాటు, ప్రభుత్వ సబ్సిడీ సక్రమంగా అందేటట్టు చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను, మార్కెట్ యార్డు కార్యదర్శిని కోరారు.



ఉల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

ఆటో బోల్తా పడి యువకుడు మృతి

- ఇద్దరికీ స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామ సమీపంలో అప్పీ ఆటో బోల్తా పడి యువకుడు పులి మున్న (15) మృతి చెందారు. శుక్రవారం సిఐ గంగాధర్ వివరాల మేరకు... కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన పులి మున్న, ఆటో డ్రైవర్ ఎరుకల మారుతి, తిమ్మప్ప కలిసి ఆస్పరి టమోటా మార్కెట్‌లో టమోటా కొనుగోలు చేసి గ్రామాల్లో తిరిగి అమ్ముకోవడానికి ఆస్పరికి బయల్దేరారు. చిరుమాన్‌దొడ్డి సమీపంలో ఆటో స్టీరింగ్ వీల్ విరిగి ఆటో బోల్తా పడింది. ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ పక్కనే ఉన్న పులి మున్నను ఆస్పరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్, మరో యువకునికి గాయాలయ్యాయి. రమేష్, ఎర్రమ్మ దంపతులకు పులి మున్న ఒక్కడే కుమారుడు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

సిపిఎం పోరాటం.. స్పందించిన సర్పంచి

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని బది నేహాళ్ నుంచి జి.హోసళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, రోడ్డు బాగు చేయాలని రోడ్డుపై వరి నాట్లు వేసి సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ రోడ్డుపై రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం సర్పంచి ప్రసన్న గౌడ్ స్పందించి గరుసును వేయించి రోడ్డును బాగు చేయించారు. సిపిఎం పోరాట ఫలితంగా రైతులకు ఇబ్బందులు తొలిగాయి.



గరుసు వేయిస్తున్న సర్పంచి. పక్కన నాయకులు

ఉల్లి, టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతు, వ్యకాస నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఉల్లి, టమోటా పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, ఈ సీజన్‌లో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు దేవనకొండలో విలేకరులతో మాట్లాడారు. ఉల్లి పంట క్వింటాకు రూ.50 రావడం రైతును దగా చేయడమేనని, కిలోకు కనీసం రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లి, టమోటా పంటల ధరలపై ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని, రూ.వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తే ఉల్లి క్వింటా రూ.50 నుంచి 500, టమోటా కిలో రూ.3 నుంచి రూ.6 మాత్రమే పలుకుతోందని తెలిపారు. పంట కోత, టమోటా తెంపిన ఖర్చులకు కూడా సరిపోవడం లేదని చెప్పారు. ఉల్లి, టమోటా పంటలను మార్కెట్‌కు తీసుకు రావడానికి అయ్యే ఖర్చులు కూడా రైతులకు రావడం లేదని పేర్కొన్నారు. పెట్టుబడి రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఉల్లి క్వింటా రూ.3 వేలు, టమోటా కిలో రూ.10 ప్రకారం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యకాస మండల సీనియర్ నాయకులు యూసుఫ్ బాషా, రైతు సంఘం మండల కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

పాముకాటు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

- డాక్టర్ పావని

ప్రజాశక్తి - కౌతాళం

పాముకాటు పట్ల రైతులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పావని తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాముకాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో వ్యవసాయ పనుల్లో ఉన్న కూలీలు, రైతులు పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యవసాయ పనుల్లో ఉన్నప్పుడు కాళ్లకు, చేతులకు గ్లౌజులు ఉపయోగించాలని తెలిపారు. కాటుకు గురైన వారు నాటు వైద్యానికి వెళ్లకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు రావాలన్నారు. ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలన్నారు. పాముకాటు, తేలుకాటుకు గురైనప్పుడు భయాందోళన చెందవద్దని సూచించారు. చాలామంది నాటు వైద్యానికి వెళ్లి సమయాన్ని వృథా చేసి ప్రాణాపాయ స్థితిలో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పావని



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కృష్ణ

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రమాదకరం

- కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వాడకం మానుకోవాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. శుక్రవారం 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడారు. అక్టోబర్ 2 వరకు పరిసరాల పరిశుభ్రత, చెత్తాచెదారంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. పట్టణంలోని తిక్క స్వామి దర్గా, పెద్ద మసీదు వద్ద, పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎన్నో ఏళ్లుగా ఉన్న చెత్త నిల్వ డంపును తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు పెంచి పచ్చదనం ఉట్టి పడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాగి, సిల్వర్ బాటిళ్లను వాడాలని విద్యార్థులకు సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతాయని తెలిపారు. హెల్త్ ఆఫీసర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ... రోగాలకు మూల కారణం చెత్తాచెదారమేన ని, పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగాలు దరి చేరవని వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, రమేష్ నాయుడు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, నాగరాజు పులికొండ ఉన్నారు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రకాశం జిల్లా జెసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం కోశాధికారి శివశంకర్ సింగ్, మండల అధ్యక్షులు రాముడు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు రఫీ, నాగార్జున, నబీ, హుస్సేన్, మధుబాబు, సునీత పాల్గొన్నారు.

గుండెపోటుతో టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి - నందవరం



గోవిందు (ఫైల్)

మండలంలోని ముగతి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త చింతకాయల గోవిందు (53) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతి విషయం తెలుసుకున్న బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరన్న గౌడ్, టిడిపి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ భార్గవ్ యాదవ్‌లు గోవిందు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబం సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

సొంత నిధులతో వంతెన ఏర్పాటు

- కృష్ణమ్మకు స్థానికుల సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని రాయ నగర్ కాలనీవాసులు వంకపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతుండగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ సొంత నిధులతో వంకపై వంతెన ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఆమెను కాలనీవాసులు పూలమాల, శాలువాతో సన్మానించారు. పట్టణంలో రాయ నగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బహిర్భూమి వెళ్లేందుకు బ్రిడ్జి లేక ఇబ్బందులు పడుతున్నామని.. వంకపై రాకపోకలకు సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు తనను కోరారని తెలిపారు. మహిళల ఇబ్బందులను తెలుసుకొని తమ సొంత నిధులు రూ.లక్షతో కొత్తగా ఇనుప రాడ్లతో వంతెన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గుడిసె ఆది కృష్ణమ్మ సేవా దృక్పథాన్ని మెచ్చుకుంటూ కాలనీ వాసులు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి నాయకులు ఆమోస్, రాణి, సంయుక్త, మాజీ ఎంపిపి మురళీ, కల్లుబావి మల్లి, బైచిగేరి ఓంకార్, మండగిరి బాబురావు, సాధిక్ వలీ, దేవేంద్ర, హనుమంతు, ఆంజనేయులు, భరత్, విజయ్, చిట్టి, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, నాగరాజ్, అంజి పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న గుడిసె ఆది కృష్ణమ్మ



నిరసన చేపడుతున్న నాయకులు

దారి ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా..?

- సిసి రోడ్డు వేయాలంటూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో సిసి రోడ్డు వేయాలంటూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బురదమయంగా మారిన రహదారిపై విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు శ్రీరామ్ మాట్లాడారు. చింతకుంట గ్రామంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాల ఊరికి చివరన కిలోమీటరు దూరంలో ఉందని, పాఠశాలకు వెళ్లే దారి నల్ల మట్టి దారి కావడంతో చిరుజల్లులకే కుంటలా మారుతోందని చెప్పారు. దారి మొత్తం బురదమయంగా మారి గుంతలుగా ఏర్పడి విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, గ్రామస్తులు సమస్యను పలుమార్లు సర్పంచి, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని చెప్పారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సిసి రోడ్డు వేయాలని, లేకపోతే విద్యార్థులను, గ్రామస్తులను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ వర్మ, దాదు, గ్రామస్తులు నాగరాజు, వీరాంజి, సుల్తాన్ పాల్గొన్నారు.

ఎల్లార్తిలో ప్రముఖుల పూజలు

ప్రజాశక్తి - హోళగుంద

ఎల్లార్తి గ్రామంలోని హజరత్ షేక్షావలీ, షాషావలీ ఉరుసు మహోత్సవం సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. టిడిపి ఎల్లార్తి సీనియర్ నాయకులు ఈడిగ గోవింద్ గౌడ్, టిడిపి యువ నాయకులు ఈడిగ రాజేంద్ర గౌడ్, ఈడిగ భువనేష్ గౌడ్ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్, టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి.ఫిరోజ్ దర్గాను సందర్శించి పవిత్ర చాదర్‌ను సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సబిహా పర్వీన్, దర్గా కమిటీ సభ్యులు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ అహ్మద్, టిడిపి ఎల్లార్తి నాయకులు వీరన్న గౌడ్, దిద్ది నాగప్ప, దిద్ది మల్లయ్య, పంపాపతి, కురువ దర్గన్న, సాఫీర్ ఖాన్, కురువ బందప్ప, మాల లింగప్ప, మల్లయ్య, వన్నూర్ వలీ, వసీం బాష, టిడిపి నంద్యాల నాయకులు సుబ్రీ, అక్బర్, కిరణ్, సైలాబ్, బుగ్గరాముడు, అర్షద్, ఖాజా పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు సకాలంలో అందించాలని సిఐటియు డివిజన్ నాయకులు కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవద్దని, వారికి పెండింగ్ వేతనాలు చెల్లించి, ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని కోరారు. వారికి పనిముట్లు, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. రామాంజనేయులు, హనుమంతు, గోవిందు, చిన్న గోవిందప్ప, నాగన్న పాల్గొన్నారు.